# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
# విశాఖపట్నం కేంద్రం
# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ఈ నెల 9వ తేదీన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

- గత పదేళ్ళుగా దేశాన్ని అభివృద్ధి పథంలో ఎన్డీఏ కూటమి నడిపిస్తోందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొ న్నారు.

- ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.

- ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్య దేవత మోదకొండమ్మ అమ్మవారి జాతరను ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు.

- రానున్న మూడు రోజులలో రాష్ట్రంలో నైరుతి రుతు పవనాలు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ ఈ నెల 9వ తేదీన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ప్రమాణ స్వీకారం జరగనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నరేంద్ర మోదీతో పాటు ఆయన కొత్త మంత్రివర్గంతో ప్రమాణం చేయిస్తారు. దీంతో వరసగా మూడవసారి ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బీజేపీ నాయకులు ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ రోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిఏడి కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సిఎస్ గోపాల కృష్ణ ద్వివేది,పిసిసిఎఫ్ కార్యదర్శి వై.మధుసూదన్ రెడ్డి,ఐటి కార్యదర్శి కె.శశిధర్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, కార్యదర్శి శ్రీధర్ తదితర శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో మరింత సమర్ధవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ ప్రజా స్వామ్య కూటమి ఎన్డీఏ పక్ష నేతగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు నరేంద్ర మోడీని కూటమి పార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఢిల్లీలోని పార్లమెంట్ సంవిధాన్ భవన్‌లో ఈ రోజు జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఎన్డీఏ కూటమి పక్షాలు హాజరయ్యాయి. నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్డీఏ పక్షనేతగా మోదీ పేరును బీజేపీ నాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు. జనసేన అధ్యక్షులు కె పవన్ కల్యాణ్ తదితర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నాయకులు బలపరిచారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ, దేశంలో ఎన్డీయే ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి రాబోతోందని తెలిపారు. చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మోడీని దార్శనీకునిగా అభివర్ణించారు. మోదీ నేతృత్వంలోని భారతదేశం గత పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి చెందిందని కొనియాడారు. ఆయన నేతృత్వంలోనే భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందని ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటిష్ పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ రూపొందించిన మూడు నూతన నేర న్యాయ చట్టాలను స్వాగతిస్తున్నామని తిరుపతికి చెందిన న్యాయవాదులు పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాన్ని జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నామని న్యాయవాది ఉమ ఆకాశవాణితో పేర్కొంటూ..

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాంధ్రా ప్రజల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం పాడేరులోని వెలసిన మోదకొండమ్మ అమ్మవారి జాతరను ఈనెల 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. జిల్లాలోని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఈ రోజు సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఘటాలు శతకం పట్టుకు తరలింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, విద్యుత్తు సదుపాయాలు, వైద్య సేవలు వంటి వాటిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే అమ్మవారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికార్లను ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 750 మంది పోలీసులతో పోలీసు బంధోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలియచేసారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి కార్యాలయం సీఎంవోలో పనిచేస్తున్న పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు బదిలీ చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి పూనం మాలకొండయ్య ప్రస్తుతం సీఎంవోలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రేవు ముత్యాలరాజు సీఎంవోలో కార్యదర్శి హోదాలో ఉండగా, నారాయణ భరత్ గుప్తా అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు సాధారణ పరిపాలన శాఖకి రిపోర్టు చేయాలని నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ ప్రజాస్వామ్య కూటమి పక్ష నేతగా నరేంద్ర మోడీని భాగస్వామ్య పక్షాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేపథ్యంలో ఎన్టీయార్ జిల్లాలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఈ రోజు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్

బాజీ మీడియా తో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశాన్ని మోదీ అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని, ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేశారని గుర్తు చేసారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ సంచులకు, పేపర్ గ్లాసులకు ప్రత్యామ్నాయంగా గాజుగ్లాసులు, నార సంచులు వినియోగించుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ కమీషనర్ డి. మురళీకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. తాడేపల్లిగూడెం లో ఆయన ఈ రోజు ఆకాశవాణి తో మాట్లాడుతూ, పట్టణంలో విస్తృతంగా ప్లాస్టిక్ నిషేధం పై ప్రచారం, ర్యాలీలు నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో శ్రీవారి దర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 10 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 62 వేల 160 మంది భక్తులు దర్శించుకోగా భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.35 కోట్ల రూపాయలు వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజులలో రాష్ట్రంలో నైరుతి రుతు పవనాలు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర రాయలసీమ పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 1500 మీటర్లు ఎత్తులో ఉన్న ఉపరితల అవర్తనము కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారి తెలియచేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు )

= = = = = = = = = = = = = = = = = = = =

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లో ఈ రోజు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థులు బడికి దూరం కావడం పట్ల దృష్టి సారించాలని కోరారు. చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలలో ఆకస్మిక తనిఖీలు చేసి బాల కార్మికులను గుర్తించాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ రోజు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం -2024 ఘనంగా ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చీర్ల పద్మశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో వివిధ అంశాలపై చిన్నారులకు శిక్షణ అందించడం అభినందనీయం అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందిస్తోంది. దీనిలో భాగంగా గుంటూరు నగరంలోని గవర్నమెంట్ DLTC-ITI కళాశాలలో ఈ నెల 15 నుండి ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్, ఆటో మోబైల్ వాషింగ్ కోర్సులలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లుగా ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్

B.S.S.S.V ప్రసాద్  తెలిపారు. మూడు నెలల పాటు ఈ శిక్షణను పూర్తి ఉచితంగా అందించనున్నామని అయన పేర్కొన్నారు.  పదవ తరగతి పాసైతే ఈ శిక్షణ కు అర్హులని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =